క్లుప్తంగా

సస్పెండైన పోలీస్ చెల్లెలి పెళ్లికి కేటీఆర్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న రామకృష్ణారావు

మానకొండూర్: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిన రాజన్న సిరిసిల్లలోని 70 మంది టీఎస్‌పీఎస్ కానిస్టేబుళ్లలో కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రాధారపు శ్రీనివాస్ ఒకరు. ఈనేపథ్యంలో అతడి ఆర్థిక ఇబ్బందులను చూసి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చలించిపోయారు. కానిస్టేబుల్ చెల్లె వివాహానికి మంగళవారం రూ.3లక్షలు పంపించగా, కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు బాధితులకు అందజేశారు. నాయకులు తాళ్లపల్లి శేఖర్, రామంచ గోపాల్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న అలివేలు

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(సీఈఓ)లో జరుగుతున్న పదో జోనల్ లెవల్ ఆటల పోటీల్లో రెండో రోజు గెలుపొందిన విద్యార్థులకు మల్టీ జోనల్ అధికారి కె.అలివేలు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్ గోలి జగన్నాథం, సీహెచ్.లచ్చయ్య, ఉదయ్‌కుమార్, కె.వాసు, ఇనాక్, పీఈటీలు ప్రవీణ్, శివ, శేఖర్, జగదీశ్, క్రీడా విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న దండు కొమురయ్య

హుజూరాబాద్‌రూరల్: బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా, సమన్వయంతో ముందుకెళ్లాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య అన్నారు. పట్టణంలో మంగళవారం సంస్థాగత ఎన్నికల వర్క్ షాపు బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో వంద సభ్యత్వాలు నమోదయ్యేలా చూడాలన్నారు. బూత్ అధ్యక్షుల నియామకం కోసం నాయకులు, కార్యకర్తలు సంసిద్ధం కావాలన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడొద్దు



చెల్పూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో విద్యుత్ శాఖాధికారులు మంగళవారం పోల్ టూ పోల్ తనిఖీ చేపట్టారు. ఈసందర్భగా రూరల్ ఏఈ జనార్దన్ మాట్లాడుతూ... విద్యుత్ కనెక్షన్ లేనివారు మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీటర్ వినియోగించకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలన్నారు. డీఈఏఈ రాములు, ఏఈలు సంపత్ రెడ్డి, రఘుచారి, సంజీవ్‌రావు, ఎస్ ఎల్ఐ రాజిరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ రామంచ సమ్మయ్య, శ్రీనివాస్, లైన్‌మెన్‌లు ఐలేశ్, కనకయ్య, ఏఎల్ఎంలు అంబాల వెంకటేశ్వర్లు, శరత్‌రెడ్డి, తిరపతి, గణేశ్, మహేందర్ పాల్గొన్నారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామ కారోబార్ చిలుకమారి రాజమౌళి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, నాయకులు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు ఒడ్నాల రవీందర్, దికొండ లక్ష్మీనారాయణ, సబ్బని రాజేందర్, అలుసా భద్రయ్య, సబ్బని రవీందర్, చిదురాల చక్రపాణి, చేరాల శ్రీనివాస్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్‌లో మృతుల కుటుంబాలను మంగళవారం బీసీ సంఘం నాయకుడు జక్కని సంజయ్ కుమార్ పరామర్శించారు. హార్వెస్టర్ ప్రమాదంలో కోనేటి ప్రశాంత్ చేయి కోల్పోగా ఆయనకు ధైర్యం చెప్పారు. మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న దాసారపు శ్యాం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నత్తనడకన పనులు..

- అండర్‌పాస్ నిర్మాణ పనులతో అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- ఫ్లైఓవర్ సామగ్రి తరలించే టిప్పర్లు, వాహనాలతో ప్రమాదాలు
- పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



కేశవపట్నంలో అసంపూర్తి అండర్‌పాస్ నిర్మాణ పనులు



కేశవపట్నంలో ఫ్లై ఓవర్..

శంకరపట్నం: మండంలంలోని తాడికల్ నుంచి మొలంగూర్ వరకు అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వీటిని నిర్మిస్తున్నారు. కేశవపట్నం, మొలంగూర్ కాస్‌రోడ్డు వద్ద పనులు పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. మొలంగూర్ క్రాస్ నుంచి శంకరపట్నం మండల గ్రామాలే కాకుండా వీణవంక, జమ్మికుంట మండలాల నుంచి వాహనదారులు వస్తుంటారు. మండలంలోని కేశవపట్నం, కరీంపేట ప్రజలేకాకుండా సైదాపూర్, తిమ్మాపూర్, చిగురుమామిడి మండలాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తారు. ఓవైపు ఫ్లై ఓవర్ నిర్మాణ సామగ్రి తరలించే టిప్పర్లు, ఇతర వాహనాలు, మరో వైపు గ్రామాలకు వెళ్లే వాహనాలతో ప్రమదాలు జరుగుతున్నాయి. ఇటీవల అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన దంపతులు బైక్‌పై చిన్నారితో కలిసి వెళ్తుండగా త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయట పడిన విషయం తెలిసిందే. మొలంగూర్ క్రాస్ వద్ద ప్రమాదాలు జరిగి తీవ్రంగా గాయపడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి.

పనులు పూర్తి చేయాలి



కేశవపట్నం గ్రామనికి వెళ్లేదారిలో ఫ్లైఓవర్ నిర్మిస్తుండడంతో అండర్‌పాస్ పనులు పునాదుల్లోనే ఉన్నాయి. దీంతో వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు పూర్తి చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– మేకల తిరుపతి, కేశవపట్నం

అధికారులు స్పందించాలి



మొలంగూర్ క్రాస్ రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద అండర్‌పాస్ కోసం గుంతలు తీశారు. గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ గుంతలో దిగబడటంతో రాయి కింద పడింది. ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మా ఊరికి చెందిన నలుగురు వ్యక్తులకు ప్రమాదాలకు గురయ్యారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

– రవి, ఆటో డ్రైవర్, చింతలపల్లి

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



తిమ్మాపూర్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్సై శ్రీకాంత్, అధికారులు

సైదాపూర్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హుజూరాబాద్ ప్రోహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ టి.శ్రీనివాసులు అన్నారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు డ్రగ్స్ అనర్థాలపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్ ఉన్నత, గొడిశాల పాఠశాలల్లో మంగళవారం డ్రగ్స్ అవేర్నెస్ కాన్షియస్ క్లబ్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు–అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని, సమాజంలో చెడ్డవారిగా తయారవుతారని సీఐ అన్నారు. విద్యపై దృష్టి సారించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీంద్రాచారి, సూర్యనారాయణ, ఎస్ఐ వినోద్‌కుమార్, హెచ్‌సీ ముకుందరెడ్డి, సిబ్బంది కార్తీక్, శృతి ఉన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ సెయింట్ ఆంటోని పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కాన్షియస్ క్లబ్ ఏర్పాటు చేశామని ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కాన్షియస్ క్లబ్‌లో సభ్యులుగా ముగ్గురు ఉపాధ్యాయులు, ఇద్దరు విద్యార్థులు ఉంటారని, డ్రగ్స్ వినియోగం, విక్రయం గూర్చి తెలిస్తే క్లబ్ సభ్యులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ సంపత్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ రమేశ్, ఎక్సైజ్ సిబ్బంది శేషగిరి రాజు, కొండాల్‌రెడ్డి, సురేశ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

జమ్మికుంట: పట్టణంలోని 21వ వార్డులో డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణం దినం విస్తరిస్తున్న తరుణంలో అభివృద్ధే ధ్యేయంగా పాలక వర్గం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆరోగ్యం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, డాక్టర్ రాజేశ్వర్‌రావు, మున్సిపల్ ఏఈ రాజేందర్, వార్డు నాయకులు రుస్తుం పాల్గొన్నారు.

తాలు, తేమ పేరుతో కోతలు

వీణవంక: రైతుల సమస్యలను ప్రభుత్వం విస్మరించిందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కాసర్ల సుధాకర్ అన్నారు. మండలంలోని కొండపాకలో మాట్లాడారు. తాలు, తేమ పేరుతో మిల్లర్లు అడ్డగోలుగా కోతలు పెడుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేసి సకాలంలో రైతులకు డబ్బులు చెల్లించిందని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదన్నారు. యాసంగి సీజన్ ప్రారంభమైన రైతుభరోసా ఊసేలేదని, వానకాలం డబ్బు వేయలేదని, రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వానికి రానున్న స్థానిక ఎన్నికల్లో గడ్డు పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

హుజూరాబాద్‌రూరల్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎంహెచ్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వంతడుపుల అన్వేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామకానికి సహరించిన రాష్ట్ర నాయకుడు సముద్రాల సంపత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సౌరవిద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

హుజూరాబాద్‌రూరల్: భవిష్యత్‌లో సౌరవిద్యుత్ వాడకం పెరగనుందని, సౌరవిద్యుత్‌తో బహుళ ప్రయోజనాలున్నాయని నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ కార్పొరేషన్ హైదరాబాద్ డిప్యూటీ మేనేజర్ ఇంజనీర్ టి.ముత్తుకుమారన్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రీసెంట్ అడ్వాన్స్ ఇన్ ఎనర్జీ సిస్టమ్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. సౌరవిద్యుత్‌ను సామాన్య ప్రజలకు ఉపయోగంలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో సహాయక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. 2030లో సౌర విద్యుత్ దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ మొదలు పెట్టిందన్నారు. విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు వినియోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. కళాశాలలో సౌర విద్యుత్‌పై ప్రాజెక్టులను విద్యార్థులతో చేయించాలన్నారు. నాగాపూర్ ఎన్ఐటీ ప్రొఫెసర్ విశ్వేశ్వరయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామాషా, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జమ్మికుంట మార్కెట్ కమిటీ సభ్యులు, నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామక ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్నసదానందం, వైస్‌చైర్మన్ సతీశ్‌రెడ్డి, నాయకులు మంగళవారం కలిశారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం నూతన మార్కెట్ కమిటీకి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కమిటీకి సూచించారు. కార్యక్రమంలో నాయకులు దేశినికొటి, పొనగంటి మల్లయ్య, ఇంగిలే రామారావు, పెద్దికుమార్ నాయకులు పాల్గొన్నారు.





హుజూరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, జమ్మికుంటలో

అధికారులపై దాడి అమానుషం

హుజూరాబాద్‌రూరల్: రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. తహసీల్దార్ కె.కనుకయ్య సీనియర్ అసిస్టెంట్ రవి, ఆర్ఐలు శేఖర్,రంజిత్ రెడ్డి ఉన్నారు.

జమ్మికుంట: తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండే ప్రభుత్వ అధికారులపై దాడులను తీవ్రంగా ఖండించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఇల్లందకుంట: అధికారులపై దాడులు అమానుషం అని తహసీల్దార్ రాణి అన్నారు. తహసీల్దార్ ఆఫీస్ ఎదుట సిబ్బంది నిరసన తెలిపారు. ఆర్ఐ నాగరాజు, చేరాలు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

శంకరపట్నం: గుడాటిపల్లెలో తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి సర్వేను పరిశీలించారు.



ఇల్లందకుంటలో...



గుడాటిపల్లెలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కర్

రోడ్డుపై పడిన ధాన్యం బస్తాలు



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ట్రాక్టర్ నుంచి ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. కన్నాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించారు. తూకం వేసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో కేశవపట్నంలోని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా రోడ్డుపై పడిపోయాయి. పాత బస్తాల్లో ధాన్యం నింపడం వల్ల సంచులు చినిగిపోయాయని రైతులు ఆరోపించారు. మండలంలోని ముత్తారం గ్రామంలో మరో ట్రాక్టర్ నుంచి ధాన్యం రోడ్డుపై పడ్డాయి. జాతీయ రహదారిపై ధాన్యం బస్తాలు పడినప్పుడు వాహనాలు నెమ్మదిగా రావడంతో ప్రమాదం తప్పింది.



మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది నుంచి లక్ష్మీపూర్ వెళ్లే మార్గంలో పంటపొలాల నుంచి, కెనాల్ కాలువ నుంచి వచ్చే నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో రోడ్డు గుంతలమయంగా మారుతుంది. అంతేకాకుండా గుంతల్లో నీరు నిలుస్తోంది. ఫలితంగా రోడ్డుపై నుంచి వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలని, అధ్వానంగా తయారైన రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఏఈ ఆర్‌అండ్‌బీ 94408 18867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

అక్రమ నిర్మాణం కూల్చివేత



షెడ్డును కూల్చివేసిన అధికారులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 28వ వార్డులో రోడ్డుపై అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డును మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఆదేశాల మేరకు టీపీవో శ్రీధర్, టీపీఎస్ ప్రదీప్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం కూల్చేశారు. ఈసందర్భంగా అక్రమ నిర్మాణంపై పలు ఫిర్యాదులు వచ్చాయని, స్థల పరిశీలన విచారణ అనంతరం కూల్చివేత చేపట్టామన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వే త్వరగా పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్ నాగఐలేశ్వర్, కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో సర్వేను తనిఖీ చేశారు. కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న సీసీరోడ్డు ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేని పక్షంలో బిల్లులు చెల్లించే ప్రసక్తిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

చిగురుమామిడి: మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చిన్నముల్కనూర్, చిగురుమామిడి గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను కరీంనగర్ ఆర్డీవో కె. మహేశ్వర్‌తో కలిసి సందర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, తాలు లేకుండా తూర్పార పట్టాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఖాజా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అన్వర్, తహసీల్దార్ ఎం రమేశ్, ఆర్ఐ సంతోశ్‌కుమార్, ఐకేపీ సీసీ సత్యనారాయణ, తదితరులున్నారు.

పంట చేను ధ్వంసం



చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పరిధి బరిగెలపల్లెలో వికలాంగుడు బరిగెల సంపత్ ఎకరా భూమిలో మొక్కజొన్న సాగుచేశాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌తో పంటను కలియదున్ని ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ధ్వంసమైన పంటను చూసి సంపత్, భార్య, కూతురు బోరున విలపించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పల్లెప్రకృతి వనం చెట్లు..

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సుమారు 32 మొక్కలను సోమవారం రాత్రి ధ్వంసం చేశారని గ్రామస్తులు ఆరోపించారు. 2020లో మొక్కలను నాటగా ఏపుగా పెరిగాయని, ఆకతాయిలా లేక కావాలనే ఎవరైనా చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయంపై స్థానిక పోలీసులకు జీపీ సిబ్బంది ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పశుగ్రాసం దగ్ధం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శివారులో మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌తో పశుగ్రాసం దగ్ధమైందని రైతులు తెలిపారు. హన్మకొండకు చెందిన వ్యక్తి ట్రాక్టర్‌లో పశుగ్రాసం కట్టలు వేసుకొని ఎస్సారెస్పీ ఉపకాలువ కట్టపై వెళ్తుండగా విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలడంతో నిప్పురవ్వలు పశుగ్రాసంపై పడి మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ చాకచక్యంగా ట్రాలీ, ఇంజన్‌ను వేరు చేశాడు. గడ్డితోపాటు ట్రాలీ అగ్నిప్రమాదంలో కాలిపోయిందని రైతులు పేర్కొన్నారు.

హైనాదాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామంలో హైనా దాడిలో లేగదూడ మృతి చెందింది. రైతు పోతరవేని సంపత్ పశువుల పాకలో సోమవారం సాయంత్రం లేగదూడను కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూసేసరికి లేగదూడ మృతి చెంది ఉంది. మండల పశుసంవర్ధ కశాఖాధికారి విజయ్‌భాస్కర్, ఫారెస్టు బీట్ అధికారి శేఖర్‌కు రైతు సమాచారం ఇచ్చాడు. అధికారి హైనా దాడి అని ధృవీకరించారు. మృతిచెందిన లేగదూడ విలువ రూ.వేలల్లో ఉంటుందని, ప్రభుత్వం సంపత్‌ను ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

రామడుగు: రోడ్డు ప్రమాదానికి గురైన చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. మండలంలోని వెదిర గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్ శనివారం రాత్రి కరీంనగర్ బస్టాండు నుంచి రోడ్డు దాటుతుండగా గంగాధర మండలం కొండాయిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి జగిత్యాల నుంచి బైక్‌పై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ప్రమాదంలో హుస్సేన్ కాళ్లు, చేతులు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని గ్రామస్తులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందాడని సంఘటనపై రామడుగు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని స్థానికులు తెలిపారు.

ముగ్గురికి జరిమానా

శంకరపట్నం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురిని మంగళవారం హుజూరాబాద్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఈశ్వరయ్య రూ.3,500 జరిమానా విధించారని ఎస్సై రవి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని వాహనదారులకు సూచించారు.